# ఎబిసిడి - ఎఫ్ఓబి

మిస్టర్ పెళ్ళాం సినిమాలో రాజేంద్రప్రసాద్ ఫోన్ పక్కనే కూర్చుని బడకంగా ఫ్యానూ అనీ, పళ్ళుతోముకుంటూ పేస్టూ అని అరుస్తుంటే తెగ నవ్వుకున్నాం.

అదే సంఘటన మా విష్ణుమూర్తిగారమ్మాయి శారా, అదే సరస్వతి, గోవిందంలో పెళ్ళయిన మూడునెలల్లో విడాకులిచ్చినప్పుడు అదెంత సీరియస్ విషయమో అర్థమయింది. శారా మొదట్నించీ మొత్తుకుంటూనే వుంది అమెరికాలో పెరిగిన ఇండియన్నే పెళ్ళి చేసుకుంటానని. అయినా విష్ణుమూర్తి, లక్ష్మీదేవి శారా మాట వినకుండా మనవాడే అని ఇండియాలో సుబ్బరంగా పీడబ్ల్యూడీలో పని చేసుకుంటున్న గోవిందంకిచ్చి పెళ్ళిచేశారు అతనూ మంచి తెలివిగలవాడే, చదువుకున్నవాడే మంచివాడే. డోకా లేదు. కాని వాతావరణంలో మార్పుందాయె. అతను అన్నం తిన్నప్లేటు అక్కడే వదిలేయటం, సోఫాలో కూర్చుని కాఫీ అని అరవటం. మరి హెల్ప్‌కైనా లేవక పోవటం, ముఖ్యంగా మధ్యాహ్నం అన్నం తినగానే ఏపనీచేయకుండా మూడు గంటలు నిద్రపోవటం. అమెరికాలో పెరిగిన శారాకి నచ్చలేదు. అతనికీ చిన్నప్పటినించీ అలవాటయిన తన పద్ధతి మార్చుకోవటం ఇష్టం లేకపోయింది. అలా చిరుజల్లులా మొదలయిన చినుకులు, చినికి చినికి తుఫానులా ముంచుకు వచ్చి, ఆ పెనుగాలికి ఎగిరిన ఆకులతోపాటు వారికి విడాకులు కూడా తెప్పించాయి. అయితే ఇండియాలో పెరిగినవాళ్ళు అమెరికాలో పెరిగినవాళ్ళని పెళ్ళిచేసుకోకూడదా? చేసుకుంటే ఆ వివాహాలు విడాకులవరకేనా? అదే పై పేరాగ్రాఫ్‌కి నీతి అనుకుంటే మీ పేరు అపార్థసారధి అని అర్థమైపోతుంది. అది మనుష్యుల స్వభావాలనిబట్టీ పెరిగినవాతావరణాన్నిబట్టీ వుంటుంది. కొంతమంది కొండలెక్కేవాళ్ళు వున్నట్టే, చిన్నరాళ్ళు కాళ్ళకి తగిలి క్రింద పడేవాళ్ళూ వున్నారు. కాకపోతే అలా ఎదురు దెబ్బ తగిలి క్రింద పడేవాళ్ళు, కొండ లెక్కితే జారిపడే ప్రమాదంవుంది అని మనందరికీ తెలుసు.

ఆ మధ్య ఇంటర్‌నెట్‌లో ఓ వ్యాసం వచ్చింది. ఆ గణాంకాలు అంతగా గుర్తు లేవుకాని, నాకు గుర్తున్న వివరాలివి. అమెరికాలో పుట్టి పెరిగిన అబ్బాయిలకి ఇండియాలోపెరిగిన అమ్మాయిలని పెళ్ళిచేసుకోటానికి అభ్యంతరాలున్నా అంత ఎక్కువగా లేవుట. అంటే కొంతమంది అబ్బాయిలు అంతగా అభ్యంతరం పెట్టటంలేదని. కాని అమెరికాలో పుట్టి పెరిగిన అమ్మాయిలు ఇండియాలో పెరిగిన అబ్బాయిలని పెళ్ళి చేసుకోవటానికి ఒప్పుకోవటం లేదుట . అక్కడక్కడా దీనికి వ్యతిరేకంగా జరిగినా ఇది సర్వత్రా అమెరికాలో చూస్తున్నదే కనుక, ఇది నిజమని నమ్మక తప్పదు.

"నువ్వేమన్నా చెప్పునాన్నా. అలాచేసే పెళ్ళిళ్ళు ఎక్కువ రోజులుండవు.

దేర్ ఐజ్నాట్ వి ఎని కంపాటిబిలిటీ!" ససేమిరా అంది మీరా.

"ఆఁ! మీ పిచ్చిగాని కంపాటిబిలిటీ ఎందుకుండదు. మేం లేమూ. నేను ఒడ్డెం అంటే మా ఆవిడ తెడ్డెం అంటుంది. మాకు పెళ్ళయి ముప్ఫై ఐదేళ్ళయింది" పాళ్ళావిడ ఆఫీసునించి వచ్చి, వంట చేసి, భోజనాలయాక సింకు నిండా వున్న గిన్నెల్ని కడుగుతూ అంటుంటే. సోఫాలో కూర్చుని టీవీ చూస్తూ సొలిసి పోతున్న సోమసుందరం అంటున్నాడు.

"అసలు మీ యూనివర్సిటీలో రెండు ఇండియా స్టూడెంట్ అసోషియేషన్లెందుకే?" అని అడిగింది చుట్టం చూపుగా ఇండియానించీ వచ్చిన పిన్ని.

"ఎందుకంటే ఒకటి మాది! అంటే అమెరికాలో పుట్టిపెరిగిన ఇండియన్స్ దన్నమాట.." అని అనీటా అంటుంటే సారథి అడ్డం వచ్చి, "అంటే ఎబిసిడీలదన్న మాట" అన్నాడు నవ్వుతూ.

"కొత్తగా ఇండియానించి వచ్చినవాళ్ళు, ఇండియన్ అమెరికన్స్‌ని ఉద్దేశించి అనే మాట అది. ఎబిసిడీ అంటే అమెరికన్ బార్న్ (బ్రాటప్) కన్ఫ్యూజ్డ్ దేశీ అని" దానికి అర్ధం చెప్పింది కమల.

"అది నేను ఒప్పుకోను. వాళ్ళు మమ్మల్ని చూసి జలసీతో అనే మాటది. మాకు మా జీవితం గురించి. మా భవిష్యత్తు గురించి నిర్దుష్టమైన అభిప్రాయాలున్నాయి. ఐ డోంట్ కేర్ వట్ వాట్ దె సే. దిసీస్ మై లైఫ్. అండ్ ఐ విల్ లివ్ ది వే ఐ వాంట్" అంది అనీటా.

'సరే! మరి ఆ రెండోది?" అడిగింది పిన్ని.

"రెండోది ఇండియానించి కొత్తగా వచ్చినవాళ్ళు పెట్టుకున్న అసోషియేషన్. అంటే ఎఫ ఓ బీ లదన్నమాట. ఎఫ్ ఓ బీ అంటే ఫ్రెష్ ఆఫ్ ది బోట్ అని"

ఆ రెండు అసోషియేషన్ల ప్రోగ్రాములూ చూసింది కనుక కమల, తన చెల్లెలికి వివరంగా చెప్పింది. "ఎబిసిడీల ప్రోగ్రాముల్లో కొన్ని ఇండియన్ పాటలకి డాన్సులు చేసినా వెరైటీ వుంటుంది. మేం వెళ్ళిన ప్రోగ్రాంలో ఇక్కడే పుట్టి పెరిగిన పిల్లలు బ్యాలే డాన్సులూ, ఒపెరా పాటలు, ఇంగ్లీష్ మ్యూజిక్ బ్యాండూ, చిన్న ఇంగ్లీష్ స్కిట్స్, అన్నిటికన్నా మించి అమెరికన్లతోనూ, మిగతా దేశాలవారితోనూ కలిసి చేసే బ్రేక్ డాన్సు, టెక్సాస్ లైన్ డాన్సులూ, మన పిల్లలు చాలమంది ఇండియన్ డ్రస్‌లే వేసుకున్నా అక్కడి వాతావరణం వేరేగా వుంటుంది. ఓంకారం మీద మన సంస్కృతీ, అమెరికన్ కల్చరూ కలిపిచేసిన ఫ్యూజన్ డాన్స్ బావుంది. మంచి ఆడియో విజువల్ ఎఫెక్ట్సున్నాయి దాంట్లో. ఎఫ్ఓబీ ప్రోగ్రాముల్లో నేటి హిందీ సినిమాల్లో గ్రూప్ డాన్స్‌లెక్కువ. ఒకటో రెండో భరతనాట్యాలూ కూడ పాడి చేసినా, ఈ రికార్డింగ్ డాన్స్‌లే ఎక్కువ. నాకూ ఆయనకి రెండూ ఇష్టమే. అందుకే రెండిటికీ వెడతాం" అంది కమల.

సారథి అన్నాడు. "అంతేకాదు. ఇక్కడి వాళ్ళకి ఇండియాలో గవర్నమెంటూ, అక్కడి బిజేపీ, కాంగ్రెస్, తెలుగుదేశం, రాజకీయాలేవీ తెలీదు. వీళ్ళకా విషయాలమీద ధ్యాసకూడా లేదు. అలా అని వీళ్ళేమీ రాజకీయాలకి దూరంగా

మాత్రం లేరు. మా సీలూ హోవార్డ్ డీన్ ప్రెసిడెంషియల్ కాంపైనింగ్‌లో సిన్సియరా మంగా పనిచేస్తూ వుంది. అలాగే చాలమంది మన పిల్లలు ఇక్కడ డెమోక్రాటిక్ పార్టీలోనూ, రిపబ్లికన్ పార్టీలోనూ పనిచేస్తూనే వున్నారు.. స్టేట్ లెవెల్‌లోనూ, సెంట్రల్ లెవెల్‌లోనూ సెకండ్ జనరేషన్ పిల్లలు ముందుకు వస్తూనే వున్నారు. అలాగే ఇండియా పిల్లలకిక్కడి రాజకీయాలమీద ఎక్కువ ఇంట్రెస్టు కనపడదు. అలాగే ఆటలు. వాళ్ళకి క్రికెట్, వీళ్ళకి అమెరికన్ ఫుట్‌బాల్. వాళ్ళకి హిందీ సినిమాలు జీటీవీ. వీళ్ళకి ఇంగ్లీష్ సినిమాలు. అంటే వాళ్ళు ఇంగ్లీష్ సినిమాలూ వీళ్ళు ఇండియన్ సినిమాలూ చూడరని కాదు. వారివారి ప్రాధాన్యతలు వేరని. అలాగే వీళ్ళు అమెరికన్ ఫ్రెండ్స్‌తో కలిసిపోతారు. ఇలా చాల తేడాలున్నాయి"

"అంటే వీళ్ళూ, వాళ్ళూ కలవరా" అడిగింది పిన్ని.

అనీటా అంది " అలా ఏమీ లేదు. అందరం స్నేహితులమే. కాకపోతే మాట్లాడుకోటానికి కామన్ టాపిక్స్ తక్కువ. కొంతమంది అలాటివేమీ పట్టించుకోకుండా ఏమీ అరమరికలు లేకుండా కలిసిపోతారు. ఏ టాపిక్ అయినా ఉత్సాహంగా వుంటే మంచి కలుపుగోలుగా వుంటారు. మాకు తెలీని కొత్త విషయాలు తెలుసుకోటానికి అదొక మంచి మార్గం"

"మరి వీళ్ళిద్దరి మధ్యా పెళ్ళిళ్ళు ఎలా వుంటాయి?" అడిగింది పిన్ని.

అది విని నవ్వింది అనీటా. ఎవరైనా ప్రశ్నడిగితే నవ్వటం సభ్యత కాదు కనుక "సారీ పిన్ని! ఏదో గుర్తుకొచ్చి నవ్వానంతే. నీ ప్రశ్నకి కాదు. ఈ పెళ్ళిళ్ళలో నిలిచినవీ వున్నాయి, తెగిపోయినవీ వున్నాయి" అంది.

"ఏం గుర్తుకొచ్చింది నీకు. నవ్వావు కదా" పిన్ని నవ్వుతూనే అడిగింది.

"ఏం లేదు. మా ఉషకి ఓ ఎఫ్‌ఓబీతో స్నేహం కుదిరింది. ఇద్దరూ ఒకళ్ళకొకళ్ళు నచ్చారు కూడాను. తీరా పెళ్ళి చేసుకుందామనుకుంటుంటే కథ అడ్డం తిరిగింది. అబ్బాయి తల్లి యాభై లక్షల రూపాయల కట్నం అడిగింది. అమెరికా డాలర్లలో సంపాదించుకుంటున్నారు ఆ మాత్రం ఇవ్వలేరా అని. అందులోనూ అమెరికాలో వున్న మా మగమహారాజుకి అది ఎక్కువేమీ కాదని. అమెరికాలో మహారాజులసలే లేరు. అదీకాక అమెరికాలో మగవాళ్ళు కట్నాలు తీసుకుని అమ్ముడు పోయేంత దౌర్భాగ్య స్థితిలోకూడా లేరు అని వాళ్ళతో చెప్పింది ఉష. ఆ అబ్బాయికూడా, ఇండియాలో అయితే కట్నం ఆప్పనంగా వస్తుంది అమెరికాలో రాదు అని అరమయి ముఖం చాటేయటం మొదలుపెట్టాడు. అమ్మయ్య ఎంత ప్రమాదం తప్పిపోయింది అనుకుంది ఉష" అంది అనీటా.

"మరి నీ కెలాటి వాళ్ళు కావాలే " అడిగింది పిన్ని.

"సమయం వచ్చాక చెబుతాలే. ఐ యామ్ వర్కింగ్ ఆనిట్" అంది అనీటా నవ్వుతూ.

"తెలుగబ్బాయేనా?" అడిగింది పిన్ని ఆరా తీస్తూ.

"చెబుతానన్నాగా కొంచెం ఓపిక పట్టు!" అంది అనీటా కన్నుగీటుతూ.

* * *